సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు

- పనుల పురోగతిపై ఎలాంటి సాకులూ చెప్పొద్దు
- మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ నియామకం
- హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం కింద జరుగుతున్న గృహ నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా వేగవంతంగా పనులను పూర్తి చేయించాలని హౌసింగ్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో జరుగుతున్న గహ నిర్మాణ ప్రగతిపై కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లనిర్మాణంలో హౌసింగ్ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. హౌసింగ్ కింద కావాల్సినంత డబ్బు ఉందన్నారు. మెటీరియల్ అంతా అందుబాటులో ఉందన్నారు. లేఔట్లలో మౌలిక వసతులు కల్పన జరుగుతోంది, అన్ని రకాలుగా అనుకూల పరిస్థితి ఉన్నా, ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఎందుకు తక్కువగా ఉందని అధికారులను ప్రశ్నించారు. ఇకపై ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి సాకులూ చెప్పడానికి వీలులేదన్నారు. ఎక్కువ ఇళ్లు ఇంకా పునాదులు కూడా పడని పరిస్థితుల్లో ఉన్నాయని, క్షేత్రస్థాయిలో పని చేయని వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఇళ్లకు వాలంటీర్లు వెళ్లి ఇల్లు ఎందుకు కట్టలేదు అనేది అడగాలన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన స్థలంలో ఇల్లు కట్టలేదు అంటే వారి స్థలంతో పాటు, ఇల్లు కూడా రద్దు అవుతుందన్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ నియమించి, వారంలో ఒకరోజు తనిఖీలు చేయిస్తామన్నారు. ఒక్కో డివిజన్‌కి ఒక సీనియర్ అధికారిని నియమించి ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలే చూడాలన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, డిఆర్ఓ, జిల్లా అధికారులు ఇళ్ల నిర్మాణంపై నిత్యం మానిటర్ చేయాలన్నారు. జిల్లాలోని చిలమత్తూరు మండలానికి సంబంధించి 1,271 ఇల్లు మంజూరు కాక ఇప్పటివరకు 542 ఇల్లు పూర్తి చేసి 85 శాతం పురోగతి సాధించి బాగా పనిచేసిన ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ లను స్పెషల్ చీఫ్ సెక్రటరీ అభినందించారు. ఓడి చెరువు మండలంలో 3,566 ఇల్లు మంజూరు కాగా, 10 శాతం మాత్రమే పురోగతి చూపించారని, పురోగతి చాలా తక్కువగా ఉందని, ఇది ఎంత మాత్రం తగదని, వెంటనే మెరుగుపరచుకోవాలన్నారు. కదిరి అర్బన్‌లో కూడా తక్కువ పురోగతి ఉందని, ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపించాలన్నారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ ఇకపై మండలాల వారీగా స్పెషల్ ఆఫీసర్లను నియమించి లేఅవుట్ వారీగా సమీక్ష నిర్వహించి ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా నెలకొకసారి డివిజన్లో పర్యటిస్తామన్నారు. అధికారులు అందరూ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సమన్వయంతో పని చేసి నిర్మాణ పనులు వేగవంతం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, ఆర్డీవోలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకర్‌తో పాటు వివిధ జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్... ఒకప్పుడు జెంటిల్‌మెన్ క్రీడ. ఎంతో క్రీడా స్ఫూర్తితో అందరూ చూసే వారు. దేశానికి ఆడుతున్న జట్టు గెలిస్తే చూసేవారే గెలిచినంత సంబరాలు చేసుకునే వారు. ఒకరకంగా చెప్పాలంటూ క్రికెట్ ఆటగాళ్లను ఇంటి సభ్యులుగా ఆరాధించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఈ ఆటకు జూదం అనే భూతం పట్టుకుంది. క్రికెట్ ఆటగా కాకుండా జూదంగా మారిపోయింది. ముఖ్యంగా ఐపిఎల్ సీజన్ వచ్చిదంటే ఈ వికృత జూదక్రీడ మరింత అధికంగా అవుతోంది. యువత ఈ బెట్టింగ్‌ల మాయలో పడి అప్పులఊబిలో కూరుకుపోతున్నారు. ఆన్‌లైన్‌లోనూ జూదాలు అందుబాటులో ఉండడంతో చాలా మంది దీనికి బానిసలై సరస్వాన్ని కోల్పోతున్నారు. పోలీసులు దీనిపై నిఘా ఉంచినా దీనిని నియంత్రించలేని పరిస్థితి ఉంది.

జోరుగా ఐపిఎల్ జూదం..!

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారు. ముఖ్యంగా క్రికెట్ ప్రేమికులు ఎక్కువ. క్రికెట్ మ్యాచ్ వస్తే టీవీలకు అతుక్కుపోయి ఆ ఆటను చూస్తూ ఆస్వాదిస్తారు. కుటుంబం అంతా కలిసి చూసే ఆట క్రికెట్. మారిన పరిస్థితుల దృష్ట్యా క్రికెట్ ఆటగా మర్చిపోయి జూదంగా మారింది. ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్‌లో జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు బుకీల అవతారం ఎత్తి దీనిని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని వారి నుంచి డబ్బులు గుంజేస్తున్నారు. ఒక్కసారి దీనికి అలవాటు పడిన వారు అందులో కూరుకుపోయి అప్పులపాలు అవుతున్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు, వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఈ బెట్టింగ్‌లు ఆడుతున్నట్లు తెలుస్తోంది.

బంతిబంతికీ బెట్టింగ్..

బెట్టింగ్‌లో అనేక రకాల పద్ధతులను అవలంభిస్తున్నారు. గతంలో మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారన్న దానిపై మాత్రమే బెట్టింగ్ జరిగేది. ఐపిఎల్ వచ్చాక బెట్టింగ్‌లోనూ కొత్త పద్ధతులు వచ్చాయి. బంతిబంతికీ బెట్టింగ్ కాసే అవకాశాలను కల్పించారు. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారు.? ఎన్ని పరుగులు సాధిస్తారు..? స్కోర్ సరి సంఖ్య వద్ద నిలుస్తుందా..? బేసి సంఖ్య వద్ద నిలుస్తుందా..? ఎక్కువ పరుగులు ఎవరు చేస్తారు..? వికెట్లు ఎవరు ఎక్కువ తీస్తారు.? ఇలా ఒక్కటేమిటి బంతిబంతికీ బెట్టింగ్ కాస్తున్నారు. పదులు, వందలు కాదు... వేలు, లక్షల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లోనూ బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. సెల్‌ఫోన్ల ద్వారానే ఈ బెట్టింగ్‌లు ఆడేస్తున్నారు. ఇలా బెట్టింగ్‌కు బానిసైన వారు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు.

పోలీసుల కళ్లు గప్పి...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు పెద్ద ఎత్తున దృష్టి సారించారు. ఐపిఎల్ ప్రారంభ సమయంలోనే బెట్టింగ్‌లు ఆడేవారికి హెచ్చరికలు జారీ చేశారు. బెట్టింగ్ ఆడితే అరెస్టు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుటామని పోలీసు ఉన్నతాధికారులు తెలియజేశారు. అయినా వీరి హెచ్చరికలను బేఖాతర్ చేసి బెట్టింగ్‌లు ఆడతున్నారు. సాంకేతికతను ఉపయోగించి, పోలీసులకు అనుమానం రాకుండా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. గతంలో చాలాసార్లు బెట్టింగ్ జూదరులను పోలీసులు అరెస్టు చేసి, కటకటాల వెనక్కి పంపారు. గతేడాది అయితే అంతర్‌రాష్ట్ర క్రికెట్ బుకీని అనంతలో అరెస్టు చేశారు. ఇలా ఓ వైపు పోలీసుల అరెస్టులు జరుగుతున్నా బెట్టింగ్ మాత్రం అదుపులోకి రావడం లేదు. వైరస్‌లా విస్తరిస్తున్న ఈ క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు పూర్తి స్థాయి నిఘా ఉంచి నియంత్రించకపోతే భవిష్యత్తులో దీని బారిన పడి అనేక మంది వారి జీవితాలను నాశనం చేసుకునే ప్రమాదం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంచాలి

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సాంకేతిక విద్యార్థులకు సామాజిక బాధ్యతనూ పెంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి సూచించారు. జెఎన్‌టియు విసి కాన్ఫరెన్స్ హాలులో సాంకేతిక విద్యార్థులు సమాజ అభ్యున్నతికి గ్రామాలకు వెళ్లి ఏవిధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్న అంశాలపై వర్చువల్ సమావేశాన్ని విసి రంగజనార్ధన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక బాధ్యత కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సమాజ అభ్యున్నతిలో విద్యార్థుల పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. సమాజం పట్ల వారి బాధ్యతను గుర్తెరిగి సమాజ సేవా ధక్పథం అలవరుచుకునేలా చేయవలసిన బాధ్యత ఆధ్యాపకులపై ఉందన్నారు.ఉన్నత చదువుల చదవటమే కాకుండా సమాజ సేవ చేయటం తప్పనిసరి అన్నారు. ఈ భావ ప్రతి విద్యార్థిలోనూ కలగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విద్యార్థుల సమాజసేవ అంశం విజయవంతం కావాలంటే అందరం కలిసి విద్యార్థులకు తగిన విధంగా దిశానిర్ధేశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వి.సుమలత, ఈశ్వర రెడ్డి, కేశవరెడ్డి, సురేష్ బాబు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకు పూర్వ విద్యార్థి రూ.10లక్షల విరాళం

1970వ సంవత్సరంతో అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివిన పూర్వ విద్యార్థి పి.పరంధామయ్య రూ.10 లక్షల విరాళం అందజేసినట్లు విసి జి.రంగజనార్ధన తెలిపారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ విరాళాన్ని ప్లాటినమ్ జూబ్లీ హాస్టల్ భవన నిర్మాణం కోసం ఇచ్చినట్లు తెలిపారు. అలాగే పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో విశ్వవిద్యాలయం, కళాశాల మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, జెఎన్‌టియు మాజీ ఆచార్యులు వి.శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

'గడపగడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సంక్షేమం, అభివద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 33వ వార్డులో మంగళవారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పాల్గొన్నారు, ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి పేదలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్దిని వివరించారు. ఈ సందర్భంగా కొందరు వార్డు ప్రజలు సాంకేతిక కారణాలతో వివిధ పథకాలు అందడం లేదని తెలుపగా ఎమ్మెల్యే కేతిరెడ్డి సచివాలయ సిబ్బందితో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్ పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ధర్మవరం పట్టణంలో 12వేల మంది పేదలకు ఇంటిస్థలంతో పాటు గహ నిర్మాణ సౌకర్యం కల్పించి సొంత ఇంటి కలను సాకారం చేశారన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24వేలు చొప్పున 4 ఏళ్ల పాటు కార్మికులకు సాయం అందించారన్నారు. వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్య, వసతి దీవెన, అమ్మ ఒడి పథకాలతో పిల్లల చదువుకు సాయం అందించారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి సంక్షేమాంధ్రప్రదేశ్‌గా మార్చి దేశంలోనే అగ్ర స్థానంలో నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, వార్డు ఇన్‌ఛార్జి బడన్నపల్లి కేశవరెడ్డితో పాటు 40వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే మున్సిపాల్టీకి అగ్రస్థానం

కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ లింగం నిర్మల - వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా..

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది సమష్టిగా కృషితోనే ధర్మవరం మున్సిపాలిటీ అభివద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందని ఛైర్‌పర్సన్ లింగం నిర్మల పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో మంగళవారం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అజెండాలోని ప్రధాన అంశాలను మున్సిపల్ సిబ్బంది చదవి వినిపించగా సభ్యులంతా వాటిపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం వార్డుల్లో నెలకొన్న పలు సమస్యలపై కౌన్సిలర్లు గళం వినిపించారు. శివారు కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. అనంతరం ఇటీవల విధి నిర్వహణలో గాయపడిన పారిశుధ్య కార్మికుడు లింగన్న చికిత్సకు రూ. 1.50 లక్షల వరకూ ఖర్చు అవుతుందని కౌన్సిలర్ గజ్జల శివ తెలుపగా కౌన్సిలర్లు వేముల జయరామిరెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, గజ్జల శివ, జేసీబీ రమణ, తేజ నెల జీతం అందజేస్తామని ప్రకటించారు

ఛైర్‌పర్సన్‌గా రాజీనామా

మున్సిపల్ సమావేశం చివరలో ఛైర్‌పర్సన్ లింగం నిర్మల తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను రాజీనామా చేస్తున్నానని చెబుతూ రాజీనామా లేఖను అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. రెండేళ్ల తన పదవీ కాలంలో సహకరించి అభివద్ధి పనుల్లో భాగస్వామ్యులైన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు. ఆడవారంటే వంటింటి కుందేలుగా ఉండకుండా ఉన్నత పదవులు అలంకరించాలన్న ఆకాంక్షతో తనకు అవకాశమిచ్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డికి రుణపడి ఉంటానన్నారు. కౌన్సిల్ సభ్యులు మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, తదితరులు ఛైర్‌పర్సన్‌గా లింగం నిర్మల మున్సిపాలిటీ అభివృద్ధికి చేసిన కషిని కొనియాడారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూర నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డితో పాటు కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రాజీనామా పత్రాన్ని అందిస్తున్న ఛైర్‌పర్సన్ నిర్మల

ఆస్పత్రిలో ప్రసవం సురక్షితం

జిల్లా వైద్యాధికారి డా.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రతి గర్భిణి ఆసుపత్రిలో ప్రసవం చేసుకొనేలా ఆశా వర్కర్లు అవగాహన కల్పించాలని, ఏ ఆసుపత్రి తల్లీ బిడ్డకు సురక్షితమైందో తెలియజేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణారెడ్డి ఆశా వర్కర్లను ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆశా వర్కర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు ఆసుపత్రులలో ప్రసవించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆశా వర్కర్ ప్రసవం అనంతరం బాలింతల ఇళ్లకు వెళ్లి తల్లి, బిడ్డకు అందించాల్సిన సేవలను, హెచ్ఐవైసి ద్వారా 5 సంవత్సరాల వరకూ పిల్లలకు అందించాల్సిన సేవలను వివరించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో ఆశా వర్కర్ల విధులు, కిల్కారి మొబైల్ అకాడమీ ద్వారా గర్భవతులు, బాలింతలు. చిన్నారుల ఆరోగ్య సలహాల్ని అప్డేట్ చేయడం గురించి, ఆశాలు పనికి ఎంతగిన పారితోషకం. లక్ష్యాలను చేరుకోకపోవడం వల్ల పారితోషికం ప్రోత్సాహకాన్ని నిలుపుదల చేయడం లాంటివి వివరించారు. గ్రామాలలో ప్రతి శుక్రవారం పర్యటించి ఫ్రై డే నిర్వహణ చేపట్టడం, కీటక జనిత డెంగీ, మలేరియా, తదితర వ్యాధులను అరికట్టాలని సూచించారు. గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార కమిటీలు సమావేశంలో తీసుకునే నిర్ణయాలను ఎంతమేర అమలు చేస్తున్నారో సమీక్షించారు. గ్రామస్థాయిలో ఆశా వర్కర్లులు నిర్వహించే అన్ని రికార్డులు అప్డేట్‌గా వుండాలని ఆదేశించారు. ఆశా వర్కర్ల ఫిర్యాదులను ఆశా ఫెసిలిటేటర్ సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మవరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వియా, జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయ ఇన్‌ఛార్జి మీడియా అధికారి బాబా ఫకద్దీన్, ఏఎస్ఓ సూర్యనారాయణ, పిహెచ్‌సి వైద్యాధికారి గంగిరెడ్డి, పర్యవేక్షక సిబ్బంది వేమారెడ్డి, నారమ్మ, గౌరమ్మ, ఎంపిహెచ్ఎ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డా॥కృష్ణారెడ్డి

జెఈఈ మెయిన్స్‌లో మెరిసిన ఎల్ఆర్‌జి విద్యార్థులు

హిందూపురం : ఇటీవల విడుదలైన జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో కిరికెర వద్ద ఉన్న ఎల్ఆర్‌జి నాయుడు జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ వెంకట రామిరెడ్డి తెలిపారు. కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న కె.గుణశేఖర్ 97.42 శాతం, జె.అగస్త్య 90.15 శాతం, బి.చైతన్య రెడ్డి 83.16 శాతం, బి.మాధవ్ 78.76 శాతం, ఏ.రష్మిక 66.72 శాతం, డి.రాహుల్ నాయక్ 65.73 శాతం సాధించి మంచి ర్యాంకులు సాధించారన్నారు. మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యాసంస్థల సెక్రటరీ బాలసుందరం, ఎఒ సంజీవరెడ్డి, పాఠశాల హెచ్ఎం ప్రసాద్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అభివద్ధిని గమనించి మరోసారి ఓటేయ్యాలని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని కోటి కాలనీ, గోవింద్ చౌదరి బిల్డింగ్ ఏరియా, పాత ఆసుపత్రి వెనుక, వినాయక నగర్, నీళ్లట్యాంక్ సమీపంలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఏరియాలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో మేలు జరిగిందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మేలు జరిగిందని భావిస్తే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఇంటి యజమాని అనుమతితో ఇంటి తలుపులకు స్టిక్కర్లు, ఫోన్ నంబరు స్టిక్కర్ అంటించారు. అనంతరం మొబైల్ నంబరుకు వారి ద్వారా మిస్డ్ కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో గహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కోటి సూర్యప్రకాష్‌బాబు

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని ప్రతి కుటుంబం బాల్య వివాహాల నిర్మూలణపై అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. నవీన, డా. స్వరూప రెడ్డి సూచించారు. ప్రతి నెలా మొదటి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే 'ఆశా డే'లో భాగంగా పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అబ్బాయికి 21, అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసేలా ప్రతి తల్లి తండ్రికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలపై ఉందన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్ల లోపే వివాహం చేయటం వల్ల కుటుంబం పట్ల అవగాహనా రాహిత్యం, గర్భాశయం సక్రమంగా ఎదుగుదల లేకపోవుట, అబార్షన్లు జరుగుట, రక్తహీనత, గర్భస్థ పిండం ఎదుగుదల సరిగాలేకపోవుట, మానసిక పరిపక్వత లోపం, తదితర అంశాల వల్ల కాన్పు సమంలో తల్లి పిల్లలకు ఇబ్బందులు ఎదురౌతాయన్నారు. ఆరోగ్య కార్యకర్తలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో సహకారం అందంచాలని సూచించారు. కాన్పు సమయంలో తప్పక వెంట వుండి కాన్పు చేయించాలని సూచించారు. అనంతరం ప్రతి బాలింతకు అవసరమైన సేవలు, పిల్లలకు టీకాలు అందేలా చూడాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎంఎల్‌హెచ్‌పిలదే అని హెచ్చరించారు. త్వరలో ఊటుకూరులో ప్రారంభం కానున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నియామకమైన వైద్యాధికారులు డా.సురేష్ కుమార్, డాక్టర్.రూబీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల సక్రమ నిర్వహణకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వన్నప్ప, పర్యవేక్షకులు వరలక్ష్మి, పార్వతి, రవీంద్ర, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి
www.prajasakti.com

పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎంవి మాధవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. అలాగే మండలంలో శాంతి భద్రతలు, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై పాత్రికేయులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, గుట్కా, తదితర అసాంఘిక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని సూచించారు. శాంతి భద్రతలు, గుట్కా, ఇలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ డీఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ కరుణాకర్, స్థానిక ఎస్సై విజయ్ కుమార్, ఏఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు వాలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి-చిలమత్తూరు

రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని, సచివాలయ సిబ్బందితో సక్రమంగా మెలగడం లేదనే ఆరోపణల నేపథ్యంలో పలగలపల్లి పంచాయతీలో నలుగురు వాలెంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందడంతో వారిని తొలిగించినట్లు ఎండీఓ రాం కుమార్ తెలిపారు.

ఐక్యపోరాటాలతోనే మేడేకు సార్థకత

ప్రజాశక్తి-నల్లమాడ

ఐక్య పోరాటాలతోనే మే డే వేడుకలకు సార్థకత చేకూరుతుందని కార్మికులు పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ కూడలితో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గోవిందు ఎర్ర జెండాను ఆవిష్కరించి మే డే ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు రంగమ్మ, మేరీ సుజాత, లక్ష్మీదేవి, మండల పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు, పంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకుడు నరసింహులు, గంగాద్రి, తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన మే డే వేడుకల్లో సిపిఐ నియోజకవర్గ నాయకులు అంజి, నాయకులు వెంకటరమణ, హయాసాబ్, బోరింగు రమణ, లక్ష్మీదేవి, చిన్నరాయుడు, ఆదిలక్ష్మి, రామచంద్ర, రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

టిడిపి మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణలకు మంగళవారం తెల్లవారుజామున మడకశిర పట్టణంలోని తిప్పేస్వామి ఇంటి వద్ద ఏఎస్ఐ కష్టారెడ్డి, పోలీసులు నోటీసులు అందించి హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ మడకశిర పట్టణంలో అవినీతి, అక్రమాలను ఎండగట్టడానికి మున్సిపల్ కార్యాలయం ముట్టడికి టిడిపి పిలుపునివ్వగా ఆ కార్యక్రమాన్ని అణచి వేయడానికే పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టులు చేయడం దారుణమన్నారు.

మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామికి నోటీసులు ఇస్తున్న ఏఎస్ఐ కృష్ణారెడ్డి

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగేంద్ర మాట్లాడుతూ నాలుగేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. జగన్ పాలనలో సీసీ రోడ్డు కానీ, ఒక భవనం కానీ, పూర్తిగా నిర్మించి ప్రజలకు చేసిన పుణ్యమంటూ ఏదీ లేదని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కులప్ప, రామంజి, గోవిందు, నరేష్, అశ్వర్థప్ప, మూర్తి, వైఎస్ సర్పంచి అశ్వర్థప్ప, నరేంద్ర, నాగేష్, నారాయణ, శివప్ప, కష్టమూర్తి, శంకర్, సుబ్బారాయుడు, బైలాంజి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు గురించి వివరించినట్లు తెలిపారు.



'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

క్లాప్ వంద శాతం అమలు చేయాలి

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన ఛైర్‌పర్సన్ ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లాప్ కార్యక్రమాన్ని హిందూపురం పురపాలక సంఘంలో వంద శాతం అమలు చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం అధికారులతో కలిసి పురపాలక సంఘం పరిధిలోని 21వ వార్డు మోతుకపల్లి, చిన్నగుడ్డంపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె మట్లాడుతూ హిందూపురం పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ కోసం 22 గార్బేజ్ ఆటోలు ఏర్పాటు చేశామన్నారు. చెత్త సేకరణ కోసం ప్రతి ఇంటకీ గార్బేజ్ ఆటో వెళ్లాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి డంప్ యార్డులకు తరలించాలన్నారు. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీప్పవని హెచ్చరించారు. క్లాప్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసి ఉత్తమ పురపాలక సంఘంగా తీర్చిదిద్దాలన్నారు. ఆమె వెంట డిఈఈ నీరజ, ఏఈ నాగేంద్ర, మేస్త్రీలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ

డంపింగ్‌యార్డులో సిబ్బందితో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

పురపాలక సంఘం వ్యాప్తంగా చేపట్టిన అభివద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఛైర్‌పర్సన్ ఇంద్రజ గుత్తేదారులకు సూచించారు. ఒకటో వార్డులోని కొట్నూరు బీసీ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన అభివద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు ఎప్పటికప్పుడు గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించాలన్నారు. బీసీ కాలనీలో రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ దష్టికి ప్రజలు తీసుకెళ్లారని, ఆయన సూచనల మేరకు పురపాలక సంఘం సాధారణ నిధుల నుంచి రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతామన్నారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, డిఈఈ నీరజ, ఏఈ నాగేంద్ర, వైసిపి నాయకులు, అధికారులు ఉన్నారు.

ముస్లిముల మనోభావాలను దెబ్బతీస్తే సహించం

వక్ఫ్ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వక్ఫ్ భూమి, దర్గా, ఖబరస్తాన్‌లకు నష్టం కలిగించి ముస్లిము మైనారిటీల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నాలను స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డి మానుకోవాలని ఖాజీ అన్సర్ బాషా, ఫతేఖాన్, మస్జీద్ ముతవల్లి ఆజాం హితవు పలికారు. పట్టణంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని కుటాగుళ్ల వద్ద నిర్మించనున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జికి అనుకూలంగా వేయనున్న రోడ్డు కోసం గతంలో హైవే పక్కన ఉన్న ఇళ్లకు పరిహారం ఇచ్చి కూల్చేశారన్నారు. అయితే ఇప్పుడు అనవసరంగా వంపులు తిప్పి రూ. కోట్ల విలువ చేసే వక్ఫ్ భూమి, ఈద్గాహ్, ఖబరస్తాన్, దర్గా భూమిని నాశనం చేయడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది దర్గాకు వెళ్లే దారిలో కాలువ తవ్వించడంతో పాటు దర్గా కాంపౌండ్ వాల్ పడగొట్టించారని ఇలాంటి ఉన్మాద పద్ధతులు మానుకోవాలని హెచ్చరించారు. అభివద్ధి ముసుగులో వక్ఫ్ ఆస్తులను నాశనం చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే వైఖరికి వ్యతిరేకంగా ముస్లిము సామాజిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలని పట్టణ వైసిపి అధ్యక్షుడు బహుద్దీన్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి దేవర నాగన్న పిలుపునిచ్చారు. ఇటీవల వక్ఫ్ ఆస్తుల ఖబ్జా, ముస్లింలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆప్కి ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఇలియాజ్ పేర్కొన్నారు. దర్గా ఖబరస్థాన్, ఈద్గాహ్‌లకు నష్టం వాటిల్లకుండా ఓవర్ బ్రిడ్జి నిర్మించి తమకు న్యాయం చేయాలని దర్గా వంశపారంపర్య ముతవల్లి సయ్యద్ ఉబేదుల్లా హుసేని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణ అధ్యక్షుడు బాహుద్దీన్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల మనోభావాలు దెబ్బతీయడానికి ఎవరు ప్రయతించినా వదిలే ప్రసక్తే లేదని దర్గా, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఎంతదూరమైనా వెళ్తామని హెచ్చరించారు. 14వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు కాపాడుతానని చేసిన వాగ్దానాలు తుంగలో తొక్కడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో ముస్లిం కమిటీ కో కన్వీనర్ అలీఖాన్, అరుణ్ కుమార్, నాయకులు మణి, ఖాతాబ్ ఖాన్, జియా, ఖలందర్, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు షకీల్, ముబారక్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిము మైనారిటీల నాయకులు

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రాయచోటి రోడ్డులోని గంగన్నగారిపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను శాసన సభ్యులు డా. పివి సిద్ధారెడ్డి కదిరి ఏరియా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగన్న గారిపల్లి వద్ద రాయచోటి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు, 108 వాహనం యాక్సిడెంట్‌కు గురై అనేక మంది గాయపడడం దురదష్టకరమన్నారు. ఏరియా ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన వైద్య సేవల కోసం అనంతపురం రెఫర్ చేయాలని సూచించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారంత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని రంగేపల్లి, మాగేచెరువు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 6 వారాలుగా బిల్లులు రాలేదని, పనిక తగ్గ కూలి అందడం లేదని, వేసవిలో అందించే మజ్జిగ, పనిముట్లు, గడ్డపార, తదితర అలవెన్స్‌లు అందించడం లేదని పలమార్లు అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధి హామీ పథకాన్ని తొలగించాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. ఏటా కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి కేటాయించే నిధులను తగ్గిస్తూ వస్తుందన్నారు. ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ. 600 ఇవ్వాలని, 360 రోజులు పని కల్పించాలని గతంలో వచ్చే అన్ని అలవెన్స్‌లు కూలీలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న శ్రీ సత్యసాయి జిల్లా పిడి కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి ధర్నా చేస్తామని, మండలంలో ఉన్న ఉపాధి కూలీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టప్ప, చేనేత మండల నాయకులు కుమ్మరి క్రిష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న

నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం

ముఖ్యఅతిథిగా హాజరవనున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-తలుపుల

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఈ నెల 3 తేదీ ముఖ్యఅతిథి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ భవనం అందుబాటులోకి రావడం ద్వారా రోగులకు మెరుగైన సేవలందే వీలుంది. 8 దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని తొలగించి, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి చొరవతో నూతన భవనాలు నిర్మించారు. ఆస్పత్రికి తగినంత సిబ్బంది నియమించి రోగులకు అన్నివేళలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామని ఇప్పటికే ఎమ్మెల్యే తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

పెనుకొండ : ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పేదలు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వ్యక్తిగత అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ పట్టణంలోని 8వ బ్లాక్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే చేసి ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలను దాదాపు వంద మందిని గుర్తించామన్నారు. వీరందరూ పట్టణంలో రోజు వారీగా ఇంటి పనులు, ఇటుక బట్టీ, హమాలీ, తదితర పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకొనే వారన్నారు. వీరికి కూలి పని చేసి ఇంటి అద్దె కట్టుకోవడం భారంగా మారిందన్నారు. కావున అధికారులు నిష్పక్షపాతంగా అర్జీలను పరిశీలించి అర్హులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేని పక్షంలో మరింత మందిని సమీకరించి రాబోయే కాలంలో పెద్దఎత్తున ఇళ్ల స్థలాల స్వాధీన ఆక్రమణ పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, తిప్పన్న, గోవింద, ఉత్తప్ప, వెంకటేష్, అశ్విని, అంజనమ్మ, రామాంజనమ్మ, లావణ్య పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వ్యక్తిగత అర్జీలు అందజేస్తున్న పేదలు

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

ఓబులదేవరచెరువు: పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వేసవి సెలవులను వథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి, సామాజిక కార్యకర్త గౌస్ లాజమ్ సూచించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తకాలను పక్కనపెట్టి మిత్రులతో కాలక్షేపం చేయడం తగదన్నారు. సెలవుల్లో ప్రతి విద్యార్థి పై చదువులకు సంబంధించిన పుస్తకాలను తీసుకొని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామ శివారులో ఉన్న చెరువులు, కుంటలు, బావులకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ప్రమాదాల బారిన పడి కన్నవారికి శోకం మిగిల్చినవద్దని హితవు పలికారు. స్నేహ బంధాలు పెంపొందించుకోవాలన్నారు. క్రీడల్లో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగితే క్రీడల కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు.

ఆరోగ్యశ్రీపై ప్రజలకు అవగాహన కల్పించండి

కొత్తచెరువు: ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీపై ప్రజలకు అవగాహన కల్పించాలని కదిరి డివిజన్ ఆరోగ్యశ్రీ అధికారి ఎల్లప్ప సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణవలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్యామిత్రలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎల్లప్ప మాట్లాడుతూ మహిళలు ప్రయివేటు, ప్రభుత్వాస్పత్రిలో ఎక్కడ కాన్పు అయినా రూ. 5000 చెల్లిస్తారన్నారు. ఆరోగ్యశ్రీ కింద 815 రోగాలకు ఉచిత వైద్యం అందిస్తుందన్నారు. ఆంధ్ర, కర్నాటక, తమిళనాడులో ఉన్న హాస్పిటల్లో కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ కంబగిరి స్వామి, సూపర్‌వైజర్ నరసింహులు, ఏఎన్ఎంలు రాధా, ఉమాదేవి, ఆశా కార్యకర్తలు పద్మావతి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు

దాచూరి స్ఫూర్తే ఉపాధ్యాయ లోకానికి దిక్సూచి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అమరజీవి దాచూరి రామిరెడ్డి ఉద్యమస్ఫూర్తే ఉపాధ్యాయ లోకానికి దిక్సూచి అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి కొనియాడారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ ఉద్యమ నిర్మాత, ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయ పూర్వ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దాచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో తలెత్తుకొని బతుకుతున్నారంటే ఆయన పోరాట స్ఫూర్తే అన్నారు. ఆయన జిల్లా నాయకత్వం నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన నాయకుడన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని రాష్ట్రంలోనే కాకుండా కలిసివచ్చే ఇతర రాష్ట్రాల్లోనూ చేపట్టారరన్నారు. ఆయన స్ఫూర్తితోనే యూటీఎస్ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, రామకష్ణ నాయక్, రాంప్రసాద్, గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, నాగేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

దాచూరి రామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని సత్యసాయి నగర్‌కు చెందిన సిమ్రాన్ భాను మంగళవారం విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భర్త బాబావలి మగ్గం పనులకు సక్రమంగా వెళ్లలేదని, ఇలా అయితే కుటుంబం ఎలా గడిచేదని మనస్థాపానికి గురైన సిమ్రాన్ భాను ఇంటిలో ఉన్న విష ద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

ముగ్గురు దొంగల అరెస్టు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఈ నెల 28 వ తేదీన చిలమత్తూరులోని ఎస్ఏఆర్ సూపర్ మార్కెట్‌లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. చోరీ జరిగిన తీరు సీసీ కెమెరాలో రికార్డు అయింది. దాని ఆధారంగా ఎస్ఐ శ్రీనివాసులు దొంగతనానికి పాల్పడిన ముగ్గురు అనుమానితులను కొడికొండ చెక్ పోస్టులోని గంగోత్రి డాబా సమీపంలో పట్టుకొని విచారించగా చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. దొంగలించిన రూ. 35 వేల నగదులో వారు రూ. 25 వేలు అవసరాలకు వాడుకోగా రూ.10 వేలు, ఓ పోన్ రికవరీ చేయగలిగామని తెలిపారు. అయితే పట్టుబడిన ముగ్గురూ మైనర్లు కావడంతో వారిని అనంతపురంలోని జువైనల్ జస్టీస్ బోర్డ్ జడ్జి ఎదుట హాజరు పరచినట్లు తెలిపారు. అయితే దొంగతనానికి పాల్పడిన ముగ్గురూ హిందూపురం పట్టణానికి చెందిన వారని తెలిపారు.

దొంగల నుంచి స్వాధీనం చేసుకొన్న నగదు, మొబైల్

అయ్యప్ప ఆలయానికి దాతలసాయం

ప్రజాశక్తి-ఓబుళ దేవరచెరువు

మండల కేంద్రానికి సమీపంలో ఎం.కొత్తపల్లి బండపై వెలసిన ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ స్థాపన 11వ వార్షికోత్సవం సందర్భంగా మే 5వ తేదీ విద్యాగణపతి, వెలాయుధ సుబ్రహ్మణ్యం, అయ్యప్ప స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలకు దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని, అందులో భాగంగా పశు సంవర్ధక వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 3 ఆలయాల అలంకరణ కోసం 20 కిలోల రంగుల డబ్బాలు(పెయింట్ బాక్స్ లు), సిబ్బంది పవన్, హరి తదితరుల సమక్షంలో అందించినట్లు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు. అలాగే అమడగూరు మండలానికి చెందిన యరగుండ్ల నరేంద్ర రెడ్డి 5వ తేదీ పూజకు రూ. 10 వేలను పురోహితులు పంచరత్న సురేష్ శర్మ స్వామికి అందించినట్లు మంగళవారం ఆయన తెలిపారు.

ఎం.కొత్తపల్లిలో అయ్యప్పస్వామి ఆలయి

హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు

నిందితులను శిక్షించాలని ఎస్పీకి బాధితుల వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దారుణంగా హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన నిందితులను అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో హత్యకు గురైన బాధిత కుటుంబ సభ్యులతో పాటు జిల్లా ఎస్పీ ఎంవి మాధవ రెడ్డిని కలిసి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం హరి మాట్లాడుతూ కంబదూరు మండలంలోని రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన శంకర్(25) వాలంటీర్‌గా పని చేస్తున్నాడని, 3 నెలల క్రితం కొందరు మద్యం మత్తులో శంకర్‌ను రాడ్లతో కొట్టి చంపి రోడ్డు పక్కన పడవేసి ప్రమాదంగా చిత్రీకరించరన్నారు. ఇది ముమ్మాటికీ హత్యేనని తల్లిదండ్రులు గతంలో స్పందనలో ఎస్పీకి మొర పెట్టుకొన్నా పోలీసులు విచారణ కూడా చేయలేదని వాపోయారు. స్టేషన్‌లోని ఓ కానిస్టేబుల్ నిందితులకు బంధువు కావడంతోనే కేసును పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా పోలీసులు స్పందించి శంకర్‌ను చంపిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ముత్యాలు, శివానంద, బాబు, ఓబులేసు, రేకల కుంట రామాంజనేయులు, రామకష్ణ, ప్రతాప్, నాగమణి, గంగమ్మ, ఓబులమ్మ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-తలుపుల

తలుపుల గ్రామ పంచాయతీ పరిధిలోని బురుజుపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు కుమార్తె వివాహానికి తలుపుల ఉప సర్పంచ్ డీకే బాబు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డీకే బాబుది తమది ఒకే గ్రామం కావడంతో తన కుమార్తె పెళ్లికి ఆర్థిక సాయం అందజేశారని ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ, రాజారెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఎస్ఈఈడిఏపి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హరీష్‌బాబు తెలిపారు. ఆయన మంగళవారం జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యుమ్‌తో కలిసి కళాశాలలో వివరాలు వెల్లడించారు. కళాశాలలో ఏపీ నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ హబ్ తరపున మే 4వ తేదీ నుంచి కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపైన చదివి, ఆసక్తి కల్గిన యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 82975 25703 నంబర్, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా సంప్రదించాలన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

In the Court of the Junior Civil Judge:Puttaparthy

O.S.No:64/2022

Between:
Batta Dinesh Chowdary ...Plaintiff
V/s
Batta Suresh Babu and 8 Others ...Defendants.

Summons to the Defendant No:8

To,
D8: Madhusudhan Sesharaj Manipady S/o Eswar Bhatt, Manipady, Age: 40 years, D.No.4/78M, 8th Floor, Sai Eswaramma Residency, Chitravathi Road, Puttaparthy.

The Plaintiff filed the above suit for partition & separate Posession over the suit schedule property against you & the matter is posted for your appearance on 10-05-2023 either in person or through an advocate. Otherwise the matters will be decided in your absence.

(By order of the Court)

**P.Prasad, Advocate
Puttaparthy.**